# మందుల కొరతపై కలెక్టరు ఆగ్రహం



కోస్గిలో వైద్య సిబ్బందిని నిలదీస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే :** కోస్గి ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరతను గుర్తించడంలో ఎందుకు విఫలమవుతున్నారని వైద్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మందుల కొరత.. రోగుల అవస్థ' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇండెంట్ పెట్టడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తన కార్యాలయానికి ఇండెంట్ పంపాలని ఆదేశించారు. నొప్పి నివారణ మాత్రలు, టీటీ ఇంజక్షన్ల కొరత తీవ్రంగా ఉందని, జనరేటర్, రోగుల సహాయకులకు విశ్రాంతిగది అవసరం ఉందని డా॥ అనుదీప్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రి ఆవరణలో పాత భవనాన్ని కూల్చివేసి ఆ స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల తీరుపై ఆరా తీశారు. ఇక్కడి సమస్యలపై ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రతపరంగా ఇద్దరు కానిస్టేబుళ్లను ఆస్పత్రికి కేటాయించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్‌ను వైద్యులు కోరారు. రాత్రి సమయంలో ప్రత్యేకంగా గస్తీ పెంచాలని స్థానిక పోలీసులకు సూచిస్తానని ఎస్పీ చెప్పారు. అనంతరం గుండుమాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి తాళం ఉండడం చూసి అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను కలెక్టరేట్‌కు రావాలని కబురు పంపించారు.

# వంతెన నిర్మించి.. రూపం ఇవ్వండి

## కడంపల్లి వాగు ఆత్మకథ



నీటితో ఉన్న కడంపల్లి వాగు

ఈనాడు మీ తోడు

**గ**లగల పారే నీరంటే అందరికీ ఇష్టం. ఏటా వర్షాకాలంలో జోరుగా పారుతూంటే మీరంతా వాగు అంచుల వరకు వచ్చి చూస్తుంటారు. రాకపోకలు నిలిచిపోయి కష్టాలు కలిగినప్పుడు తిట్టుకుంటారు. చుట్టూ ఉన్న బోరుబావులన్నింటినీ రీఛార్జి చేస్తాను. వ్యవసాయదారులకు ఎన్నో రకాలుగా సహాయపడుతుంటాను. నాకు ఓ రూపం ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంతకూ నేనెవరో తెలిసింది కదా..

**కడంపల్లి వాగును...**

నాకు కొద్ది దూరంలో గతంలో ఓ చెక్‌డ్యాం ఉండేది. ఇక్కడ పెద్దమొత్తంలో నీరు నిలువ ఉండేది. ఇసుక సైతం పెద్ద ఎత్తున నిల్వ చేసుకున్నాను. భూగర్భంలోకి నీరు పెద్దమొత్తంలో ఇంకేందుకు సహాయ పడేదాన్ని. కొందరు అక్రమార్కులు చెక్‌డ్యాంను కూల్చి నీరు ఉండకుండా చేశారు. ఇసుక తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడంతా గోతులమయంగా మారాను. ప్రతి ఏటా వర్షాకాలంలో నీరు పారుతుంది. నాలో ఏర్పాటు చేసుకున్న తాత్కలిక మట్టిరోడ్డు వరద ధాటికి కొట్టుకుపోతుంది. రాకపోకలు నిలిచిపోతాయి. నీరు తగ్గాక మళ్లీ మట్టి రోడ్డు వేస్తారు. కథ షరా మామూలే.

నాపై వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా పలు గ్రామాల ప్రజలు కోరుతూ వస్తున్నారు. అలా నిర్మిస్తే హన్మాన్‌పల్లి, బలభద్రాయపల్లి, చింతగట్టు తండ, ఒడ్డుకింది తండ, దానమ్మ తండ వాసులకు రాకపోకలకు ఎంతో అనుకూలం. ప్రజలు ఏటా నాయకులు, అధికారులకు వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నారు. అధికార పార్టీతో పాటు, విపక్ష నాయకులు సైతం నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. పలుమార్లు ఎమ్మెల్యేలు, నాయకులు వంతెన నిర్మిస్తామని అంటున్నప్పుడల్లా సంతోషించాను. ఏళ్లు గడుస్తున్నాయే తప్ప నిర్మాణం మాత్రం చేపట్టడం లేదు. ప్రస్తుతం ఇక్కడి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. వంతెన నిర్మాణానికి నిధులిచ్చారు. పనులు మొదలెట్టి పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులది. ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులది.

ఇట్లు
**మీ కడంపల్లి వాగు...**

**- న్యూస్‌టుడే, కోస్గి**



# నగదు తీసుకో.. వేలిముద్ర వేసిపో!



## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇదే దందా

నిఘా

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

**ఇ**ప్పుడు రేషన్ దుకాణాల్లో ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం తప్ప ఏ ఇతర సరకులు పంపిణీ చేయటం లేదు. ఈ లెక్కన రేషన్ డీలర్ దగ్గర డబ్బులే ఉండొద్దు. కానీ ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా డీలర్ ముందట డబ్బులు పట్టుకుని సిద్ధంగా ఉంటున్నారు. రేషన్ దుకాణాలకు వచ్చే లబ్ధిదారులను ఏమాత్రం సంకోచం లేకుండా బియ్యం ఇస్తారా అని నేరుగా అడుగుతున్నారు. వేలిముద్ర వేయించుకుని వారికి బియ్యం కాకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం రేషన్ దుకాణం నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా తెలిసినా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కరినీ పట్టుకున్న దాఖలా లేదంటే ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



ఖిల్లాగణపురంలో పట్టుకున్న బియ్యం మహబూబ్‌నగర్ పట్టణం రవీంద్రనగర్‌లోని ఈ రేషన్ దుకాణానివే



దుకాణాన్ని సీజ్ చేయకుండా తాళం వేసిన అధికారులు

**పట్టుకుంటున్నది పోలీసులే :** ఉమ్మడి జిల్లాలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 89,95,931 రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రతినెలా 1,59,386 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. సగం కుటుంబాలు కూడా ఇంటికి బియ్యం తీసుకోవటం లేదు. భారీ మొత్తంలో బియ్యం రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా రైసుమిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 14న ఖిల్లాగణపురం మండల శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద వాహనంలో ఇద్దరు వ్యక్తులు 19 క్వింటాళ్ల ఉచిత బియ్యం తరలిస్తూ సీసీఎస్ పోలీసులకు చిక్కారు. వారిని ఆరా తీస్తే మహబూబ్‌నగర్‌లోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సమాచారంతో అధికారులు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్న పేట, రవీంద్రనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బోర్డు కూడా లేకుండా రవీంద్రనగర్‌లోని చిన్న సందులో నిర్వహిస్తున్న 5వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం తరలించినట్లు గుర్తించి ఆ డీలర్‌పై కేసు నమోదు చేశారు. 17న మానవపాడు మండలం నుంచి 23 క్వింటాళ్ల బియ్యం ఆటోలో పెబ్బేరులోని రైసుమిల్లుకు తరలిస్తుండగా సీసీఎఫ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసులు పట్టుకుంటున్నారే తప్పా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవటం లేదు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తే పట్టుకోవడం సంగతి అటుంచి వారు డీలర్లకే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అపనమ్మకంతోనే జనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు కాకుండా సీసీఎఫ్ పోలీసులకే సమాచారం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు బియ్యం పట్టుకుని నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**దుకాణాలపై నిఘా ఏదీ? :** రేషన్ దుకాణాల నుంచి ఉచిత బియ్యం తీసుకెళ్లే వినియోగదారుల ఇళ్ల వద్దకు డీలర్ల ప్రతినిధులు వెళ్లి కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున ధర చెల్లించి బియ్యం సేకరించేవారు. ఆ బియ్యం ఆటోల్లో రైసుమిల్లులకు చేరవేసేవారు. ఇప్పుడు పంథా పూర్తిగా మార్చేశారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని రేషన్ దుకాణంలోనే బియ్యం కొనేస్తున్నారు. ఆ బియ్యం ఏరోజుకారోజు రాత్రి రైసుమిల్లులకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 84 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతినెలా 11,370 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతాయి. లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని డీలర్లు దాదాపు సగం బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఇదే జరుగుతోంది. ప్రతి నెలా 28వ తేదీ నుంచే బియ్యం కోటా గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతుంది. 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు. దుకాణానికి బియ్యం చేరిన రోజు నుంచే నిఘా పెట్టాల్సి ఉన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవట్లేదు.

# నిర్వహణ లేక నీరందక!

## తరచుగా తెగుతున్న కేఎల్ఐ బ్రాంచి కాల్వ



ముత్తిరెడ్డిపల్లి వద్ద పాటు కాల్వపై ఉన్న యూటీ ఎక్కి కేఎల్ఐ కాల్వలోకి పారుతున్న వర్షపు నీరు

**కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే :** మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వపై నుంచి పాటు కాల్వలు ఉన్నాయి. వర్షపు నీరు పోవడానికి పాటుకాల్వలపై యూటీలు నిర్మాణం చేశారు. భారీ వర్షాలు వస్తే యూటీ ఎక్కిపారి కేఎల్ఐ కాల్వలోకి నీరు ప్రవహిస్తోంది. కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయక, కాల్వ గట్టు తక్కువగా ఉండటం, పాటుకాల్వపై ఉన్న యూటీల నుంచి వర్షపు నీరు ఎక్కి పారుతుండటంతో తరచుగా తెగిపోతున్నాయి.

**సామర్థ్యం 30 వేలు.. సాగు 60 వేలు :** ఏటా రెండు పంటలకు సాగునీరు ఇచ్చే కేఎల్ఐ బ్రాంచి కాల్వకు వర్షపు నీటిగండం పట్టుకుంది. కేఎల్ఐలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ, ఉప కాల్వల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయానికి ఉన్న ప్రధాన కాల్వకు మూడో కిలో మీటర్ వద్ద పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వ ఏర్పాటైంది. ఈ కాల్వ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కోడేరు, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని కొన్ని గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తుంది. మొత్తం 33 కిలో మీటర్ల పొడవున ఉండగా కోడేరు మండలంలో 12 వేల ఎకరాలు, పాన్‌గల్ మండలంలో 13 వేలు, వీపనగండ్లలో సుమారు 2 వేల నుంచి 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయిదేళ్లుగా మూడు మండలాల్లో మొక్కసారిగా ఆయకట్టు 50 వేల నుంచి 60 వేల ఎకరాలకు సాగు పెరిగింది. ఉప కాల్వల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**లైనింగ్ లేకపోవడంతోనే..:** పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు మొదటి నుంచి సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. 33 కిలో మీటర్ల పొడవునా గత ప్రభుత్వ హయాంలో 2023లో సిమెంట్ లైనింగ్ పనులకు రూ. 60 కోట్లతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పనులకు టెండర్లు పిలవలేదు. సెప్టెంబరులో దాదాపుగా 20 రోజులు కురిసిన భారీ వర్షాలకు ముత్తిరెడ్డిపల్లి, రాజాపూర్ శివారుల్లో బ్రాంచి కాల్వ తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో అధికారులే కాల్వకు గండి పెట్టి వాగులకు వరద నీటిని వదిలారు. తెగకుండా చర్యలు చేపట్టారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉన్న ఉప కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోయాయి. మరి కొన్ని కాల్వల్లో జమ్ముగడ్డి, కంపచెట్లు పెరిగాయి.

**నిధులు కేటాయిస్తేనే..**

పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ మరమ్మతులకు నిధులు లేవు. జమ్ము గడ్డి, పూడిక తీత, కాల్వ గట్టు పెంచడం, కోతలు పడితే మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు బ్రాంచి, పిల్ల కాల్వల సర్వే చేశాం. రూ. 40 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

**- రవీందర్, ఈఈ, కేఎల్ఐ, నాగర్‌కర్నూల్**

## జిల్లా కేంద్రం చూడరబాబూ!



యాద్గిర్ రోడ్డులో...



సత్యనారాయణ చౌరస్తా..

**వా**ణిజ్య కేంద్రం.. కర్ణాటక సరిహద్దున ఉండటంతో నిత్యం జనసంచారం.. ఆపై జిల్లా కేంద్రం... ఇన్ని ప్రత్యేకతలు ఉన్న నారాయణపేట రహదారులను చూస్తే ఆవేదన కలగకమానదు. గుంతలమయమైన రహదారుల్లో ఎప్పుడు ఏ వాహనం పడుతుందో అన్నట్లుంది పరిస్థితి. సత్యనారాయణ చౌరస్తా, యాద్గిర్ రోడ్డు పెట్రోల్ బంక్ ప్రాంతం, ప్రధాన రహదారిలో గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. గుంతలు ఉన్నచోట ఒక కర్రను పాతారు. తప్ప ఏమీ చేయలేదు. రహదారులను మరమ్మతు చేయాలని పౌరులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, నారాయణపేట**

## ప్రయివేటు ఆరోగ్య పరీక్షల కేంద్రం మూసివేత

**కృష్ణా, న్యూస్‌టుడే :** మండల కేంద్రం మాగనూరులోని ఒక ప్రయివేటు ఆరోగ్య పరీక్షల కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం జిల్లా వైద్యాధికారి డా. సౌభాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. అనుమతులు లేకుండా పరీక్షలు చేయడం నేరమని డీఎంహెచ్‌వో అన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డా. నాగజ్యోతి, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకటేశ్‌గౌడ్, ఆర్ఐ శ్రీశైలం ఉన్నారు.

## జూరాల గేట్ల మూసివేత

**ధరూరు, న్యూస్‌టుడే:** జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గటంతో దిగువకు గేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేసి జలవిద్యుదుత్పత్తి ద్వారా మాత్రమే వదులుతున్నారు. జలాశయంలోకి 64 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జలవిద్యుదుత్పత్తి ద్వారా 37వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణ్‌పూర్ జలాశయాలకు సైతం వరద తగ్గుముఖం పట్టింది. ఆలమట్టిలోకి 38వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా 37వేలు దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్‌లోకి 31వేల క్యూసెక్కులు చేరుతుండగా 26 వేలు వదులుతున్నారు.

# చలికాలం సారూ.. లేదండీ వేడినీరు

## కేజీబీవీల్లో నిరుపయోగంగా సౌర వేడినీటి పరికరాలు

న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం



నారాయణపేట కేజీబీవీలో నిరుపయోగంగా ఫలకాలు

**క**స్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు శీతాకాలంలో అనారోగ్యం బారినపడకుండా ఉండేందుకు కొన్ని సంవత్సరాల క్రితం వేడి నీళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఎక్కువమంది విద్యార్థినులు కావడంతో ఒకేసారి వేడి నీరు అందాలనే భావనతో సౌర నీటి యంత్రాలను ఏర్పాటు చేశారు. మొదట్లో రెండేళ్లు బాగా పనిచేసినా తరువాత మొరాయించాయి. అ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా విద్యార్థినులు ఉదయం వేళ చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోంది. జిల్లాలో 11 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. సౌరశక్తితో నీళ్లను వేడిచేసే పరికరాలను 2017లో అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రాస్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేయించారు. కొత్తగా ఏర్పాటైన కృష్ణాలో ఈ వ్యవస్థ లేదు. మరికల్ కేజీబీవీకి సొంత భవనం లేకపోవడంతో ధన్వాడ మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేశారు. అక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉంచిన సౌర ఫలకాలు పగిలిపోయాయి. ఇటీవల మరికల్‌లో కొత్త భవనం ప్రారంభించడంతో ఈ సామగ్రిని తరలించి ఓ గదిలో ఉంచారు. మిగతా తొమ్మిది విద్యాలయాల్లో హీటర్లు ఉన్నప్పటికీ మరమ్మతులకు గురికావడంతో నిరుపయోగంగా మారాయి. అందులో చాలావరకు చెడిపోయాయి. పాక్షికంగా పాడైనవాటిని మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకువస్తే విద్యార్థినుల ఇక్కట్లు తొలగించవచ్చు. వాతావరణ మార్పులతో చాలామంది విద్యార్థినులు జ్వరాలు, జలుబు తదితర అనారోగ్యాల బారిన పడుతున్నారు. వీరికి చన్నీటి స్నానం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఇంటర్ తరగతులు ఉన్నచోట పరిస్థితి మరీ ఘోరంగా ఉంటోంది. జిల్లాలో అన్నిచోట్లా సౌరఫలకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. 400 మంది విద్యార్థినులకు సరిపడే విధంగా పరిమితిని పెంచాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' జీసీడీవో పద్మనళినిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.



ధన్వాడలో పగిలిన ఫలకాలు

# ఈ సారీ.. భరోసా లేదు మరి!



**కొత్తకోట, న్యూస్‌టుడే:** రైతులకు ఒకే విడతలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం వానాకాలం పంటలకు రైతుభరోసా ఇచ్చి తీరుతుందని గట్టి నమ్మకం ఉండేది. ఆ నమ్మకంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లేశారు. జులైలో రైతుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నప్పటికీ 'రైతు భరోసా' ఎవరికి ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత రాకపోవడంతో వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వడం లేదంటూ మంత్రి స్పష్టం చేయడంతో రైతులకు నిరాశే మిగిలింది.

**ఆరేళ్లుగా సాయం..:** రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిలో ఉత్సాహం నింపి సాగును క్రమంగా పెంచవచ్చని, పెట్టుబడి కోసం అప్పులు చేయరాదని భారాస హయాంలో రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. 2018 మేలో తొలిసారి పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. తొలి ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు కలిపి రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున ఎకరాకు రూ.8 వేలు అందజేయగా తర్వాత ఏడాది నుంచి ఏటా రెండు విడతల్లో మొత్తం రూ.10 వేలు అందజేస్తూ వచ్చారు. ఇలా క్రమం తప్పకుండా ఆరేళ్లు పథకాన్ని అమలు చేశారు. గత డిసెంబర్‌లో అందాల్సిన యాసంగి రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోగా వాటిని ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. ఇదే పథకాన్ని 'రైతు భరోసా' పేరుతో ఏడాదికి రెండు విడతల్లో రూ. 7,500 చొప్పున రూ. 15 వేలు అందజేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేస్తూ వ్యవసాయదారులకే కాకుండా స్థిరాస్తి వ్యాపారులకు, గుట్టలకు పుట్టలకు వీటిని అందజేసిందని, నిజమైన రైతుల కంటే బడాబాబులే ఎక్కువ లబ్ధి పొందారని వారిని ఏరి పారేసి రైతులకు భరోసా అందజేస్తామంది. ఈ క్రమంలో జూన్‌లోనే పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. అయినా మంత్రి వర్గ ఉపసంఘంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతు భరోసాకు వానాకాలం నిధులకు బ్రేక్ పడింది. యాసంగి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

**తెరచుకోని పోర్టల్ :** మరోవైపు రైతుభరోసా నమోదు చేసుకునే అవకాశం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు దక్కించుకున్న రైతులు జూన్ నాటికి రాష్ట్ర వ్యవసాయ శాఖ పోర్టల్‌కు సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి దస్త్రాలు బదిలీ కావాల్సి ఉంటుంది. జూన్ తర్వాత ఈ పోర్టల్ తెరచుకోలేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే పలు దఫాలుగా రైతుబంధును కోల్పోగా వచ్చే సీజన్ నాటికైనా రైతుభరోసాను అందుకోవాలని ఆశిస్తున్నారు.



- రైతుభరోసా అందుతుందని ఎంతో ఆశ పడ్డాం. పెట్టుబడి సాయం అందుతుందని ప్రైవేటులో వడ్డీలకు తెచ్చుకున్నాం. ఇప్పుడు సాయం దక్కకపోవడంతో పంటలపై వాటిని కట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే యాసంగి పంటల భరోసానైనా విడుదల చేసి రైతులకు అండగా నిలవాలి.

**- జలంధర్‌రెడ్డి, కొత్తకోట**

**ఉమ్మడి జిల్లాలో గత యాసంగి ఇదీ పరిస్థితి..**

| జిల్లా | లబ్ధిదారులు | ఎకరాలు | నిధులు(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,90935 | 4,44,853 | 222. 40 |
| నాగర్‌కర్నూల్ | 2,68,363 | 7,30. 311 | 365. 14 |
| వనపర్తి | 1,52,513 | 3,58,848 | 179. 42 |
| జోగులాంబ గద్వాల | 1,51,963 | 4,47,427 | 223. 69 |
| నారాయణపేట | 1,55,511 | 4,47,252 | 223. 62 |

# చెరువులకు చేపలు చేరేదెన్నడో!



ధన్వాడ మండలంలోని మందిపల్లి చెరువు

న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

**జి**ల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లాంఛనానికే పరిమితమైంది. ఈ నెల 7న ఎమ్మెల్యే డా. పర్ణికరెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారులు కలిసి నారాయణపేట మండలం కొండారెడ్డిపల్లి చెరువులో లాంఛనంగా చేపపిల్లలను వదిలారు. ఆ తర్వాత వెనువెంటనే గుర్తించిన నీటివనరులు అన్నింట్లో విడుదల చేస్తామని ప్రకటించారు. పక్షం రోజులు దాటిన ఇంకా మొదలు పెట్టలేదు. లాంఛనంగా వదిలిన చేపపిల్లలు సైతం నాణ్యత లేవని, నిబంధనలకు విరుద్ధంగా చిన్న సైజువి పంపిణీ చేశారని మత్స్యకారులు ప్రారంభం రోజునే నిరసన వ్యక్తం చేశారు.

- ఈ ఏడాది కేవలం 58 నీటివనరుల్లో 41 లక్షల పై చిలుకు చేప పిల్లల్ని వదలాలని మత్స్యశాఖ నిర్ణయించింది. గతంలో 600కు పైగా చెరువులో కోటిన్నర పైగా చేప పిల్లల్ని ఏటా విడుదల చేసేవారు. ఈ ఏడాది టెండర్ జాప్యం జరిగింది. మూడోసారి పిలిచిన టెండర్‌లో పంపిణీ బాధ్యతల్ని రాష్ట్రేతర వ్యక్తి దక్కించుకున్నారు. వాస్తవానికి చేప పిల్ల మూడు ఇంచుల పొడువు ఉండాలి. కిలోకు మూడొందలు తూగాలి. ప్రారంభం రోజు వదిలినవే అందుకు అనుగుణంగా లేవు.

**పక్షం రోజులు దాటినా..**

చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించి పక్షం రోజులు దాటింది. అయిన మిగిలిన 57 ట్యాంకుల్లో వదిలేందుకు చర్యలు తీసుకోవడంలేదు. దీనిపై మత్స్యకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాప్యం చేస్తే ఎదుగుదల ఉండబోదంటున్నారు. చెరువుల ఆయకట్టు పరిధిలో వరి సాగు చేశారని, ఎండాకాలం వస్తున్నందున నీళ్లు త్వరితగతిన ఖాళీ అవుతాయన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. చేప బాగా ఎదిగి కార్మికులకు ఉపాధి దక్కాలంటే ఎంత తొందరగా వదిలితే అంత మంచిదంటున్నారు. మరింత ఆలస్యం చేస్తే వదిలినా వదులకున్నా ఒక్కటే అని మత్స్యకారులు అంటున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జిల్లా మత్స్యశాఖాధికారి రహమాన్‌తో మాట్లాడగా చేపలు వదిలేందుకు జిల్లా కమిటీ నుంచి ఆమోదం లభించలేదన్నారు. దస్త్రం జిల్లా అధికారుల ముందు ఉందని, అది క్లియర్ కాగానే కమిటీ సభ్యుల అమోదం తీసుకొని విడుదల చేస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే రెండు రోజుల్లో విడుదల పూర్తి చేస్తామన్నారు.

# పరిహారం.. స్వాహాపర్వం

## గద్వాల పట్టణ ఠాణాలో కేసు నమోదు

**గద్వాల అర్బన్, న్యూస్‌టుడే:** జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి చేతివాటం ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయాడు. మోసాన్ని నేరుగా న్యాయమూర్తి గుర్తించడంతో పలు మోసాలు వెలుగు చూశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు భూమి బాధితులు పరిహారం పొందారు. పరిహారం న్యాయస్థానం ద్వారా బాధితులు తీసుకున్నారు. బాధితులు తీసుకున్న పరిహారం తాలూకా న్యాయస్థానం రిజిస్టర్లలో రికార్డు అయి ఉన్నాయి. అయితే బాధితుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా రెండోసారి పరిహారం పొందేందుకు(డబుల్ క్లయిమ్) న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి కొందరి సహకారంతో స్కెచ్ వేశాడు. అందులో భాగంగా ఇది వరకే పరిహారం పొందిన వారి పేరిట ఉన్న వివరాలను వైట్నర్ ద్వారా సరి చేసి వేరే వ్యక్తి పేరిట రెండో సారి పరిహారం పొందేందుకు ప్రయత్నించాడు. ఇలా పలు విడతల్లో సుమారు 2016 నుంచి 2021 వరకు అధికారికంగా రూ. 3.08 కోట్లు తన పేరిట, తన భార్య పేరిట డిపాజిట్ చేశారు. అయితే ఈ వ్యవహారం రూ.4 కోట్లకు పైగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.. ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూములను కోల్పోయిన బాధితుల రికార్డులను న్యాయమూర్తి పరిశీలించే క్రమంలో రూ. 52,45,850 విలువ చెక్కు 2021లో ఓ మహిళకు జారీచేయగా, అదే మొత్తంలో పరిహారం పొందిన ఓ వ్యక్తి పేరుపై వైట్నర్(ట్యాంపర్డ్) చేసినట్లు గుర్తించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో రికార్డులను, కంప్యూటర్ డాటాను లోతుగా విచారించడంతో సదరు అధికారి పలు విడతల్లో అక్రమాలకు పాల్పడినట్లు కనుగొని షోకాజ్ నోటీసు జారీ చేశారు. విషయాన్ని హైకోర్టు దృష్టికి న్యాయమూర్తి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశానుసారం రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. న్యాయస్థాన సీనియర్ పర్యవేక్షకురాలు ఫిర్యాదు మేరకు సోమవారం గద్వాల పట్టణ ఠాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారి, అతడి భార్యపై కేసు నమోదైనట్లు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని, ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు ప్రయత్నించిన ఘటనపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

**ప్రస్తుతానికి గుర్తించిన రెండోసారి పరిహారం జమ వివరాలు**


| తేది | నగదు (రూ.) |
|---|---|
| 23.12.2016 | 3,35,000 |
| 18.02.2017 | 8,68,227 |
| 29.04.2017 | 8,22,180 |
| 23.11.2017 | 21,66,026 |
| 16.03.2018 | 33,03,117 |
| 20.05.2019 | 69,47,120 |
| 17.12.2019 | 85,46,420 |
| 09.04.2021 | 52,45,850 |
| 16.08.2021 | 25,98,250 |


# తపాలా.. పడిలేచిన కెరటంలా

## వినియోగదారుల ఆకర్షణకు కొత్త పథకాలు

**న్యూస్‌టుడే, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి:** పడిలేచిన కెరటంలా తపాలా శాఖ కొత్తపుంతలు తొక్కుతూ, నూతన పథకాల అమలుతో పునరుజ్జీవం పొందుతోంది. ఒకప్పుడు తపాలా అంటే కేవలం ఉత్తరాలు బట్వాడాకే పరిమితం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్త పథకాలతో ప్రజల్లోకి వెళ్తూ ఆదరణ పొందుతోంది. దేశంలోని ఏ ప్రాంతానికైనా పార్శిళ్లు పంపే సౌకర్యం నేడు ఖండాంతరానికి వ్యాపింపజేసింది. కొన్ని ప్రైవేట్ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. కమ్యూనికేషన్ విభాగంలో ప్రైవేటు కొరియర్ సంస్థలు హవా నడుస్తున్న తరుణంలో తపాలా శాఖ మూసధోరణికి స్వస్తి పలికింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు పొదుపు పథకాలతోపాటు, ఇతర సేవలు అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా తపాలా వారోత్సవాలు జరుపుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి సృజన్ నాయక్ తెలిపారు. మేళాలు నిర్వహించి కుటుంబానికంతటికీ ఉపయోగపడే కొత్తపథకాలను ఈనెల 7 నుంచి వారం పాటు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు.

**జవసత్వాలు.. :** 170ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తపాలా శాఖ పడిలేచిన కెరటంలా నూతనోత్తేజంతో ముందుకు సాగుతోంది. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడుతూనే బ్యాంకు సేవలు కూడా అందించేందుకు తపాలా బ్యాంకుగా అవతరించి సేవలు అందిస్తోంది.



బిజినేపల్లి మండలం మహదేవుపేటలో బాధితులకు రూ.15లక్షల చెక్కు అందిస్తున్న తపాలా అధికారులు

### డాక్ నిర్యాత్ కేంద్ర..

ఇప్పటివరకు కేవలం దేశంలోనే పార్శిళ్లు పంపే సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి డాక్ నిర్యాత్ కేంద్ర్ అనే నూతన పథకంతో తపాలా శాఖ విదేశాలకు వినియోగదారులు తమ ఇళ్ల వద్ద నుంచే పార్శిల్ పంపే అవకాశం కల్పించింది. తపాలా కార్యాలయంలో ఆధార్, పాన్‌తో పేరు నమోదు చేసుకుంటే సదరు వినియోగదారుకు ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇంటి నుంచే పార్శిళ్లు బుక్ చేసే అవకాశం ఉంటుంది. తపాలా సిబ్బంది ఆయా అడ్రస్‌కు చేరుకుని పార్శిళ్లు తీసుకెళ్లడం, డెలివరీ చేయడం చేస్తారు. తక్కువ వ్యవధిలో, తక్కువ రుసుముతో ఈ సౌకర్యం ఏర్పాటుచేయడంతో జిల్లా కేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో నిత్యం ఈ పథకం ద్వారా విదేశాలకు పార్శిళ్ల పంపకం పెరగడంతో దాదాపు వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

DAK GHAR NIRYAT KENDRA

### ఈ కామర్స్‌తో ఒప్పందం..

ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు శరవేగంగా తమ సర్వీసులు అందిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటూనే పోస్టల్‌శాఖ వాటితో జతకట్టి దేశవ్యాప్తంగా పార్శిల్ సేవలు అందిస్తోంది. దాదాపు ప్రతి గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ సేవలు ఉండటంతో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అమెజాన్‌లో బుక్‌చేసే పార్శిల్లు పోస్టుసిబ్బంది బట్వాడా చేయనున్నారు. దీంతో పోస్టల్‌కు అధనపు ఆదాయం సమకూరనుంది. ఈ కామర్స్ ఒప్పందంతో తపాలా ద్వారా నాణ్యమైన, మన్నికైన సేవలు అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా అధికారి సృజన్‌నాయక్ వివరించారు

India Post enters in E-commerce
Seller Registration Process
भारतीय डाक Indian Post

### గ్రామీణ ప్రాంతాల్లోనూ 73 రకాల సేవలు..

కామన్ సర్వీస్ సెంటర్ల మాదిరిగా తపాలా కార్యాలయాలు కూడా పనిచేయనున్నాయి. 73రకాల సేవలు గ్రామీణప్రాంతాలలో అందిస్తున్నాయి. కరెంటు బిల్లులు, బస్, ట్రైన్ బుకింగ్, పాస్‌పోర్ట్ సేవలు (వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో) అందిస్తున్నారు. పోస్ట్ సేవింగ్‌బ్యాంకు ఖాతాలతో తపాలాబ్యాంకు ఖాతాలను అనుసంధానం చేస్తుండటంతో బ్యాంకు లావాదేవీలు చరవాణీలలోనే చేసుకునే వెసులుబాటు ఉంటోంది. సేవింగ్ ఖాతాలకు ఏటీఎం కార్డు సౌకర్యం కూడా తపాలా శాఖ కల్పించింది. జిల్లాకేంద్రాలలో తపాలా కార్యాలయాల వద్ద ఏటీఎం కేంద్రాలను కూడా ఏర్పాటుచేసింది. దీంతో తపాలా శాఖకు నిత్యం రూ.వేల ఆదాయం సమకూరుతోంది.



### బ్యాంకు సేవలతో...

India Post Payments Bank
Aapka bank, aapke dwaar

తపాలా కార్యాలయాలు కేవలం ఉత్తరాల బట్వాడా, పొదుపుఖాతాలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు అందించేందుకు ఏడేళ్ల క్రితం ఇండియా పోస్ట్ పేమెంటు బ్యాంకు గా సేవలు మొదలు పెట్టింది. వీటి ద్వారా ఆధార్ ఎనబుల్ సిస్టంతో లబ్ధిదారుల ఇండ్లవద్దే వారి బ్యాంకు లావాదేవీలు , చెల్లింపులు చేస్తోంది. ప్రమాదబీమా, ఇతర బీమా పథకాలు అందిస్తోంది. తపాలా బ్యాంకు ఏర్పాటుతో రుణాల మంజూరుకు కూడా శ్రీకారం చుడుతోంది. ఇతర బ్యాంకులు ఏమేమి సేవలు అందిస్తాయో, వాటికి ధీటుగా గ్రామాలలో తపాలా బ్యాంకు సేవలు అందించేందుకు తపాలా శాఖ నడుంబిగించింది. దీంతో తపాలా శాఖ ఆర్థికపరిపుష్టితో పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది.

### ఆదరణ బాగుంది..

చిన్నమొత్తాల పొదుపుఖాతాలతో పాటు తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాలు, ఈ-సేవ, సుకన్య సమృద్ధి యోజన పేరిట ఆడపిల్లలకు పొదుపు పథకాలు ఆదరణ పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చెల్లింపులు, ఆసరా పింఛన్లు బయోమెట్రిక్ ద్వారా చెల్లిస్తున్నాం.. అటల్ పింఛన్ యోజన, సీనియర్ సిటిజన్ పథకం, ప్రధాన మంత్రి జీవన బీమా, మంత్లీ ఇన్ కమ్ పథకం, తదితర పథకాలున్నాయి. ఏడాది వ్యవధిగల ప్రమాదబీమా పథకంలో రూ.599 ప్రీమియం చెల్లించి రూ. 10 లక్షల పరిహారం పథకం, రూ.799 చెల్లిస్తే రూ.15లక్షలు పరిహారం అందనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చాం.



**- భూమన్న, వనపర్తి డివిజన్ పర్యవేక్షకులు**

# చేనేత సహకార సంఘం పనితీరు భేష్

**అమరచింత, న్యూస్‌టుడే:** అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సహకార సంఘం పనితీరు స్ఫూర్తిదాయకంగా ఉందని వివిధ రాష్ట్రాల నాబార్డ్ అధికారులు కొనియాడారు. పట్టణ శివారులోని సహకారం సంఘాన్ని మంగళవారం కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాబార్డ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల చేయూతతో అమరచింత పట్టణంలోని చేనేత కార్మికులు సంఘం ఎలా ఏర్పాటు చేసుకున్నారో అమరచింత సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ వారికి వివరించారు. చేనేత కార్మికుడు ఒక యజమాని వద్ద చేనేత పని చేయకుండా స్వయంగా ఇక్కడ మగ్గం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా విక్రయించడం, వచ్చిన లాభాన్ని ప్రతి ఏడాది తీసుకోవడం జరిగిందన్నారు. ఇంట్లో మగ్గం ఏర్పాటుకు స్థలం లేనివారు కూడా ఇక్కడ నేత పనిలో ఉన్నట్లు చెప్పారు. సంఘం ద్వారా జరిగే ప్రతి ఖర్చు, జమ అంతర్జాలంలో నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నాబార్డు ద్వారా తెలియజేస్తునట్లు వివరించారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించి వారికి వచ్చే గౌరవ వేతనంలో అప్పు చెల్లించే విధంగా చేశామన్నారు. కర్ణాటక డీజీఎం సతీష్ కర్త, బీఐఆర్‌డీ డీజీఎం యోగేష్, నాబార్డు అధికారి షణ్ముకం చారి, డీసీసీబీ ఆత్మకూరు మేనేజర్ నబీ, సభ్యులు పాల్గొన్నారు.



మగ్గంపై నేస్తున్న చీరను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

## 24న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

**ఇటిక్యాల, న్యూస్‌టుడే:** పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఈ నెల 24న సీతారాముల కల్యాణం ఏర్పాటు చేసినట్లు కోదండ రామాలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండరామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ సూచించారు.

# చదువు రాకపోయినా ఆంగ్లంలో చేవ్రాలు!

## సిబ్బంది పేరిట దొంగ సంతకాలతో నిధులు స్వాహా

వారంతా కిందిస్థాయి సిబ్బంది.. చెప్పిన పని చేసి వెళ్లడం తప్పా.. ఏనాడు ఇదేంటని ప్రశ్నించలేని అమాయకత్వం.. ఎన్నికల సందర్భంగా వారి పేరిట ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయి. వారికి తెలియకుండా అధికారులే దిగమింగారు. కనీస చదువు రాని వారు ఆంగ్లంలో సంతకం చేసిన డాక్యుమెంట్ బయటపడటంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన సదరు అక్రమార్కులు సిబ్బందిని పిలిచి తలా కొంత ఇస్తాం తీసుకోండి అంటే ఆత్మాభిమానంతో 'మాకొద్దంటూ..' వెళ్లడం కొసమెరుపు.

**- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్**

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్నికల సమయంలో పనిచేసిన కార్మికులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా తప్పుడు సంతకాలు పెట్టుకొని నిధులు డ్రా చేసుకున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. ఎంపీ ఎన్నికల సమయంలో నిధుల విషయంలో పక్కదారి పట్టించారనే విమర్శలున్నాయి. కలెక్టరేట్‌లో స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గార్డెన్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం 20 మంది వరకు ఎంపీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించారు. కాని ఎవ్వరికి డబ్బులు ఇవ్వలేదు. ఒక్కరికి మాత్రమే రూ.18 వేలు చెల్లించారు. మిగతా వారికి డబ్బులు ఇవ్వకపోగా 13 మందికి రూ.18వేల చొప్పున డబ్బులు చెల్లించినట్లుగా దొంగ సంతకాలు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. గార్డెన్‌లో పని చేసే వారికి చదువు రాదు కానీ రెవెన్యూ స్టాంప్‌పై ఆంగ్లంలో సంతకాలు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. అన్ని ఒక్కరే సంతకాలు పెట్టినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో ఇటీవల కలెక్టరేట్‌లో ఉండే అధికారులు పనిచేసిన వారిని పిలిచి రూ.2వేలు, రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో తమకు ఈ డబ్బులు వద్దంటూ వెళ్లిపోయారు. జిల్లాలో ఎన్నికల విధుల చెల్లింపుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారోనని ఉత్కంఠ నెలకొంది.



రెవెన్యూ స్టాంప్‌లపై తప్పుడు సంతకాలు పెట్టినట్లుగా బయటికి వచ్చిన పత్రాలు





## ఇదీ అంగన్వాడీ దుస్థితి

అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి వసతి సమస్యలు ఎదుర్కొంటున్నాయో ఈ చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఊట్కూరు మండలం పులిమామిడిలో సరైన భవనాలు లేక నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో దాదాపుగా 18 మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుత భవనంలో ఒక గది, వరండా మాత్రమే ఉన్నాయి. గదిలో నాలుగు కేంద్రాల సామగ్రి ఉంచడానికే చాలడం లేదు. వరండాలో 72 మంది పిల్లలను కూర్చోబెట్టి నాలుగు వైపులా నలుగురు టీచర్లు పర్యవేక్షిస్తుండటాన్ని చిత్రంలో చూడొచ్చు.

**- న్యూస్‌టుడే, నారాయణపేట**

## నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడలు

**కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే :** కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు మంగళవారం కల్వకుర్తికి చేరుకున్నారు. గురుకుల సొసైటీ పరిధిలోని మొత్తం 16 పాఠశాలల నుంచి సుమారు 540 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు తెలిపారు.

## కోయనగర్ సమాఖ్య ఆర్పీ శ్రీలతపై కేసు

**మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే :** స్వయం సహాయక సంఘాల డబ్బులను పక్కదారి పట్టించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం,.. మహబూబ్‌నగర్ పట్టణం వేంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీలత మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్నారు. 2017 మార్చి నుంచి ఆమె కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 స్వయం సహాయక సంఘాలకు చెందిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు డబ్బులు రూ.1,49,36,205 పక్కదారి పట్టినట్లు విచారణ తేలిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల

**శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. ప్రాజెక్టు 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,508 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు జలాశయం నీటి మట్టం 884.30 అడుగులుగా (211.4759 టీఎంసీలు) ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల జలాశయం నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కుల వరద నీళ్లు శ్రీశైలంలోకి చేరుతోంది.



గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

## సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో రజతం



రజతం సాధించిన జట్టుతో సంఘం సభ్యులు

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే:** వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం వరించింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టును అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి సాదిఖ్‌అలి, ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్, సభ్యులు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, శిక్షకులు కపిల్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

**వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి వేధింపులు తాళలేక ఈవో వినోద మంగళవారం నిద్ర మాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పారు. ప్రసుత్తం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలాలా ఉన్నాయి.. 2022 నవంబరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా వినోద ఎంపికయ్యారు. పెబ్బేరులో విధుల్లో చేరాల్సి ఉండగా అప్పటి డీడబ్ల్యూవో పుష్పలత కార్యాలయ అవసరాల నిమిత్తం ఆమెను డిప్యూటేషన్‌పై జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఈవోగా తీసుకున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మమ్మ.. వినోదను పెబ్బేరు వెళ్లాలని ఒత్తిడి చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కొంత సమయం కావాలని తర్వాత వెళ్తానని చెప్పినా వినకుండా లక్ష్మమ్మ సోమవారం ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. లక్ష్మమ్మ, మరో అధికారి వేధింపులతో మనస్తాపం చెంది నిద్ర మాత్రలు వేసుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సూపర్‌వైజర్ల కొరత వల్ల ఆమె స్థానానికి వెళ్లాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై పర్యవేక్షణ ఉండాలని అందుకోసం తప్పకుండా వెళ్లాలని సోమవారం ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. బాధితురాలు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలన్నారు.

## వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

**మేడ్చల్, న్యూస్‌టుడే:** వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీఐపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిస్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తన గది లోపల నుంచి గడి పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

## లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం: ఒకరి దుర్మరణం

**కృష్ణా, న్యూస్‌టుడే :** వాసూనగర్ ఆర్టీవో చెక్‌పోస్ట్ ఎదురుగా ఆగి ఉన్న లారీని బైకుతో ఢీకొని మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) మృతి చెందాడు. మంగళవారం కొత్తపల్లి నుంచి కర్ణాటకలోని దేవసూగూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను దేవసూగూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శేఖర్‌కు భార్య, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.



శేఖర్

## అప్పు వివాదం... పరస్పరం కేసులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అప్పు విషయంలో చోటుచేసుకున్న వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తికేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫాంరేటు | 125-00 |
| రిటైల్ | 147-00 |
| డ్రెస్డ్ | 213-00 |
| స్కిన్‌లెస్ | 243-00 |

## ప్రమాదకరం.. వాసూనగర్ చెక్‌పోస్టు



వాసూనగర్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీవో చెక్‌పోస్టు ప్రమాదకరంగా మారింది. రోజూ వేలది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అనుమతుల కోసం ఈ చెక్‌పోస్టు వద్ద ఆగుతుంటాయి. ఇరుకైన రహదారి కావడంతో పెద్ద వాహనాలు ఆగి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే ఇక్కడ పదికి పైగా ప్రమాదాలు జరిగాయి. ఇరువైపులా వాహనాలు ఆగుతుండటంతో మధ్యన వెళ్లే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ చెక్‌పోస్టును విశాలంగా ఉన్న చోటుకు మార్చాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణా

## నీటి కుళాయిలు బిగించరూ..!



గుండుమాల్ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. పాఠశాలకు గేటు లేకపోవడంతో ట్యాప్ మూతలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో కుళాయిలు అలంకారంగా మారాయి. మధ్యాహ్న భోజనం సమయంలో పిల్లలు బయటకు వెళ్లి చేతులు కడుక్కోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. - న్యూస్‌టుడే, కోస్గి గ్రామీణం

## మరమ్మతు సరే.. ధూళితో జాగ్రత్త



నారాయణపేట నుంచి మక్తల్ రోడ్డులో గుంతలు కప్పుతున్నారు. వానాకాలం తర్వాత మరమ్మతు చేస్తుండటంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది. కంకరతోపాటు వేస్తున్న డస్ట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు. డస్ట్‌పై నీళ్లు చల్లాల్సి ఉండగా ఆ పని చేయడం లేదని అంటున్నారు. దీంతో వచ్చి పోయే వారిపై ధూళి ఎగిరి పడుతోంది. - న్యూస్‌టుడే, నారాయణపేట

## ఇది నర్సరీయేనా? ముళ్ల పొదా?

జక్లేర్ నర్సరీలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అందులో మొక్కల సంరక్షణను గాలికి వదిలేశారు. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై ఎంపీవో రమేశ్‌ను వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం



**మేమున్నాం.. మీకు తోడుగా..** ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు
పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836

### తెరపై ఈనాడు

**దేవర:** మనోహర్ 70 ఎంఎం(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంజల్(కోస్గి), **శ్వాగ్:** మహేశ్వరి(నారాయణపేట), **విశ్వం:** రామవేందర(మక్తల్)
-న్యూస్‌టుడే-పాతబస్టాండ్, మక్తల్ గ్రామీణం, కోస్గి న్యూటౌన్

### కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ.70, వంకాయలు రూ.60, ముల్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.80, గోరుకాయ రూ.70, క్యాప్సికం 80, బీన్స్120, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60, క్యాబేజీ రూ.50, ఉల్లి రూ.50, చింతపండు రూ.110 - న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)

## ప్రశ్నపత్రాల అందజేత



కోస్గి ఎంఆర్‌సీలో ప్రశ్నపత్రాలు అందిస్తున్న జిల్లా అధికారులు

స్పందనకు వందనం

**కోస్గి, న్యూస్‌టుడే:** పాఠశాలల్లో ఎస్ఏ 1 పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల కొరతను జిల్లా అధికారులు తీర్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రశ్నపత్రాలు తక్కువ సంఖ్యలో రావడంపై 'ఈనాడు'లో 22న 'ప్రశ్న పత్రాల కొరత. . ఉపాధ్యాయుల కలత' శీర్షికన కథనం రావడంతో అధికారులు స్పందించారు. సీఎంవోలు రాజేంద్రకుమార్, యాదయ్య శెట్టిలు సరిపడా ప్రశ్నపత్రాలను కేంద్రాలకు అందజేశారు.

## మందిపల్లిలో భాజపా సభ్యత్వ నమోదు

**ధన్వాడ, న్యూస్‌టుడే :** మందిపల్లిలో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మాకం సురేందర్ ప్రారంభించారు. స్థానికంగా ఉన్న సీతారామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సభ్యత్వాన్ని లాంఛనంగా చేపట్టారు. నాయకులు వెంకట్‌రెడ్డి, సుంకు రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్ : నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**మద్దూరు, న్యూస్‌టుడే :** ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. నిర్ధిరత, పెదిరి పాడుల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పెండింగ్ డీఏ, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు వేణుగోపాల్, రవీందర్‌నాయక్, కురుమయ్య, బాలకిష్టప్ప, రాజశేఖర్, స్వప్న పాల్గొన్నారు.

**ఊట్కూరు, న్యూస్‌టుడే :** తపస్ నాయకులు నర్సింగప్ప, కృష్ణ, గోపాల్, సురేష్, కిషోర్ తదితరుల సారథ్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

**మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే :** పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, కొత్త పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కోస్గి న్యూటౌన్:** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరారు. పోతిరెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమంలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్, కోస్గి నాయకులు అచ్చుగట్ల వెంకటరాములు, ఆంజనేయులు, పరంధాములు, రామవేందర్ తదితరులు ఉన్నారు.

**దామరగిద్ద, న్యూస్‌టుడే :** దామరగిద్దలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. హెచ్ఎం అశోక్, సత్యనారాయణ, తపస్ నాయకులు గుంపు బాలరాజు, జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు తిరుపతయ్య, బసిరెడ్డి, అంబరీశ్, కనకప్ప పాల్గొన్నారు.

**ధన్వాడ, న్యూస్‌టుడే :** ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎం నర్సింహాచారి, సురేష్‌బాబు, అశోక్, నర్సింగ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే :** మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా పాలనాధికారి సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కోస్గి కళాశాల మైదానంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడాలంటూవిద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హైదరాబాద్ వంటి చోట్ల డ్రగ్స్ విపరీతంగా వినియోగమవుతున్నాయని, ఆ సంస్కృతి ఈ ప్రాంతానికి రాకముందే అడ్డుకోవాలన్నారు. కళాశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక క్లబ్‌లు సమర్థంగా పనిచేయాలని అన్నారు. అనంతరం కళాశాల మైదానం నుంచి రామాలయం కూడలి వరకు కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఎస్పీ యోగేశ్ గౌతం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మహాత్ముడి ఆశయ సాధనకు కృషి

**మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే :** మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేద్దామని విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్ అన్నారు. సత్యశోదన పాదయాత్ర మంగళవారం మక్తల్‌కు చేరుకుంది. వివిధ వర్గాల ప్రజలు, నాయకులు, మేధావులు స్వాగతం పలికారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమమాలలు వేసి నివాళులు అర్పించారు. భూదానం సుబ్బారావు, విశ్రాంత జీహెచ్ఎం భాస్కర్, విశ్రాంత పీఈటీ గోపాలం, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, గణేష్‌కుమార్, గోలపల్లి నారాయణ, శంశొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తికి ఘన వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదుల సంఘం సభ్యులు

**నారాయణపేట, న్యూస్‌టుడే :** బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి నారాయణపేట కోర్టు భవన సముదాయంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు.. సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్ నిర్మల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం న్యాయవాదులు జి.శ్రీనివాస్ దంపతులను శాలువ, పూలమాలలతో సన్మానించి వీడ్కోలు పలికారు. కొత్త న్యాయమూర్తి వింధ్యానాయక్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, పీపీ ఆకుల బాలప్ప, ఏజీపీ భైరంకొండ భీంరెడ్డి, న్యాయవాదులు చెన్నారెడ్డి, నర్సింహులు, నాగేశ్వరి పాల్గొన్నారు.

## రాజీమార్గమే అనుసరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి రఫీ

**నారాయణపేట, న్యూస్‌టుడే:** రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. మంగళవారం పేట కోర్టు భవన సముదాయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 14న జరిగే లోక్‌అదాలత్ విజయవంతానికి అన్ని బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. సెప్టెంబర్ 28న జరిగిన లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 6002 కేసులు పరిష్కరించి పేట జిల్లా 14వ ర్యాంకులో నిలిచిందని, ఇందుకు కృషిచేసిన అధికారులు, సిబ్బందిని న్యాయమూర్తి అభినందించారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఉమర్, అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి జకియా సుల్తానా పాల్గొన్నారు.

## సమీకృత గురుకులానికి స్థల పరిశీలన



గున్ముక్ల శివారులోని భూమిని ఆర్డీవోకు చూపిస్తున్న తహసీల్దారు సింధూజ

**ధన్వాడ, న్యూస్‌టుడే :** నారాయణపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేయతలపెట్టిన సమీకృత గురుకుల పాఠశాలకు మంగళవారం ఆర్డీవో సీహెచ్ మధుమోహన్ స్థల పరిశీలన చేశారు. గున్ముక్ల గ్రామ శివారులోని సర్వే నంబరు 358లోని 25 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసీల్దారు సింధూజ ఆర్డీవోకు చూపించారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్ల, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించిన ఆర్డీవో భూమికి సంబంధించిన వివరాలు అందజేస్తే పై అధికారులకు నివేదిస్తానని వెల్లడించారు. మరికల్ మండలం చిత్తనూర్ శివారులోని సర్వే నంబరు 97, 163లలో భూములను తహసీల్దారు జమీల్ ఆర్డీవోకు చూపించారు. నారాయణపేట మండలం లింగంపల్లి శివారులోని భూమిని సైతం పరిశీలించినట్లు ధన్వాడ తహసీల్దారు సింధూజ వెల్లడించారు. ఈ మూడింటిలో అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేస్తారన్నారు.

## వికలాంగులకు హక్కులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్

**పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే :** దివ్యాంగులపై ప్రభుత్వాలు చూపించాల్సింది దయ, జాలి కాదని వారి హక్కులను కాపాడటమేనని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దశరథ్ అన్నారు. మంగళవారం నారాయణపేటలో జరుగుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నారాయణపేట జిల్లా ప్రథమ మహాసభలకు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ధరలకు అనుగుణంగా కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలన్నారు. దివ్యాంగుల సహాయకులకూ పింఛన్ అమలు చేయాలన్నారు.. స్వయం ఉపాధికోసం ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కాశప్ప కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. జెండా ఆవిష్కరణ, ఇటీవల మరణించిన ప్రొఫెసర్ సాయిబాబా, సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాల్‌రాం, బాబు, కృష్ణ, మల్లేష్, రాములు, శ్రీనివాస్, బస్వరాజ్, బాల్‌రాజ్, నర్సప్ప, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త గురువులకు సత్కారం



ఊట్కూరు: కొత్త ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తపస్ సంఘం, రాజకీయ పార్టీల నాయకులు

**ఊట్కూరు, న్యూస్‌టుడే :** ఊట్కూరుకు చెందిన కె.అశోక్‌కుమార్, జి.ప్రదీప్ యాదవ్, మాలతీలత, మోనప్ప, భారతి, మహేశ్, రాణిలు డీఎస్సీ 2024 ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ తాము ఉద్యోగ సాధనలో పడిన కష్టం వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.నరసింహా మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఊరు ఊట్కూరు అని మరోమారు నిరూపించారని ప్రశంసించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి.హన్మంతు, జేవీవీ పీఎస్ జిల్లా కన్వీనర్ హాజమ్మ, తపస్ జిల్లా సమన్వయకర్త డి.నర్సింగప్ప, కాంగ్రెస్ నాయకుడు డి.విష్ణేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



చిట్యాలలో నర్సింహులును సన్మానిస్తున్న గ్రామస్థులు

**మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే :** ప్రతికూల పరిస్థితుల్లోనూ మూడు ఉద్యోగాలు సాధించిన మంగలి నరసింహులు యువతకు ఆదర్శప్రాయుడని చిట్యాల యువకులు అభిప్రాయపడ్డారు. పోటీపరీక్షల్లో ప్రతిభ కనబర్చి బెటాలియన్ కానిస్టేబుల్‌గా, ఏఆర్ కానిస్టేబుల్‌గా, డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా యువకులు నర్సిములును సన్మానించి అభినందించారు. ఇకపై ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సహాయం అందిస్తామని యువకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం, మారుతి, పుట్టి వెంకటేశ్, రంగప్ప, నితిన్, బాబు, అజయ్, అశోక్, నర్సింహా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగిన రహదారి పనులతో అవస్థలు



కలెక్టరేట్‌లో ఏవో జయసుధకు వినతిపత్రం అందిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

**పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే :** నారాయణపేట మండలం అప్పక్‌పల్లి నుంచి కోయిలకొండ వరకు చేపట్టిన రెండు వరసల రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆటో, మోటార్ కార్మిక సంఘం నాయకులు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏవో జయసుధకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము, కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ గుత్తేదారు పనులను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటప్ప, యూసుఫ్, మల్లేష్, రాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల తీరు సరికాదు

**మరికల్ కూడలి, న్యూస్‌టుడే :** జిల్లాలోని ప్రజాప్రతినిధులు ద్వంద వైఖరి వీడి ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని చిత్తనూర్ ఇథనాల్ రద్దు పోరాట కమిటీ తరపున కేఎన్‌పీఎస్ నాయకుడు చక్రవర్తి కోరారు. చిత్తనూర్ వద్ద పోలీసు లాఠీ ఛార్జి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు కంపెనీ రద్దుకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే కంపెనీ రద్దు విషయాన్ని మర్చిపోయారన్నారు. అక్రమ కేసులు ఎత్తివేయించలేకపోయారన్నారు.

## రైతులను ముంచిన ప్రభుత్వం: భారాస

**మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే :** ఉచిత విద్యుత్ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మక్తల్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అడ్డగోలుగా విద్యుత్ బిల్లుల వసూలకు కుట్రలు చేస్తున్నారన్నారు. కృష్ణా మండలం పుంజనూరులో ఎత్తిపోతల విద్యుత్ బిల్లులు చెల్లించాలని రైతులకు నోటీసులు జారీ చేయడం విడ్డూరం అన్నారు. ముడుమాల్ ఎత్తిపోతలకు రూ. 2,43,00,338ల విద్యుత్ బిల్లులు చెల్లించాలని నోటీసులు అందించారన్నారు. చట్ట విరుద్ధంగా రైతులపై విద్యుత్ బిల్లుల భారం మోపితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. భారాస నాయకులు చిన్న హన్మంతు, గుర్లపల్లి గాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఈశ్వర్‌యాదవ్, స్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

**మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే:** ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన రీజియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య (అచ్చంపేట), ప్రధాన కార్యదర్శిగా దార సుందర్ (కల్వకుర్తి) ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, భాస్కర్, రామన్న, మహిళా కార్యదర్శిగా భాగ్య, ప్రచార కార్యదర్శిగా సురేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోపాల్, ఇమ్మానియెల్, యాదయ్యను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ పుర కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులును నియమించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఛైర్మన్ రాజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ హాజరయ్యారు.

## త్వరలో యర్నాగన్‌పల్లి పాఠశాల ప్రారంభం



యర్నాగన్‌పల్లిలో మూతపడ్డ పాఠశాల వద్ద ఎంఈవో అనిల్‌గౌడ్, గ్రామస్థులు

**మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే :** సరిపడా విద్యార్థులు లేక కొన్నేళ్లుగా మూతపడిన యర్నాగన్‌పల్లి పాఠశాలను త్వరలో ప్రారంభించి, పాఠశాల ఆస్తులను కాపాడతామని ఎంఈవో అనిల్ గౌడ్ అన్నారు. మంగళవారం యర్నాగన్‌పల్లిలో మూతపడ్డ పాఠశాల భవనాలు, స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో పాఠశాల నడపడానికి విద్యావాలంటీర్లు ముందుకొస్తే రూ.10వేలు తన సొంత డబ్బులు అందిస్తానన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వెంటనే గ్రామంలో పాఠశాలను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## పకడ్బందీగా మాదకద్రవ్యాల నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధుమోహన్

**నారాయణపేట, న్యూస్‌టుడే :** జిల్లాలో మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీవో మధుమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంజాయి సాగు జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలు, ఇతరత్రా విద్యాసంస్థల్లో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీల నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్డీవో మేఘాగాంధీ, డీఏవో జాన్‌సుధాకర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, డీఐఈవో సుదర్శన్ పాల్గొన్నారు.

## 72 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ క్రికెట్ జట్టు విజయం

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే:** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ కోసం ముందస్తుగా ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. మంగళవారం పిల్లలమర్రి దారిలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన తొలి పోరులో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గాను 47 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. అక్షయ్ 84, అరుణ్ 46, కార్తిక్ 24 పరుగులు చేశారు. నారాయణపేట నుంచి ఎజాజ్ 5, రాజు 2 వికెట్లు తీశారు. నారాయణపేట జట్టు లక్ష్య ఛేదనలో చతికిలపడి 35.3 ఓవర్లలో కేవలం 148 పరుగులు చేసి ఓడింది. తరుణ్ 30, అద్నాన్ 28 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి ముఖీత్ 4, అంజి 3 వికెట్లు తీశారు. పోటీలను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రారంభించారు. శిక్షకుడు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అఖండజ్యోతి ఊరేగింపు



చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి అఖండ జ్యోతుల ఊరేగింపులో తొగుటవీర క్షత్రియులు

**కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే :** పట్టణంలోని ఇసుకబావి దగ్గర వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి అఖండజ్యోతుల ఊరేగింపును తొగుట వీరక్షత్రియ సంఘం ప్రతినిధులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి పురవీధుల గుండా ప్రత్యేకంగా అలంకరించిన అఖండజ్యోతులను సంఘం ప్రతినిధులు ఒకరితర్వాత ఒకరు నెత్తన పెట్టుకొని భక్తిగీతాలకు నృత్యాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయానికి చేరుకొని అఖండ దీపారాధన, అనంతరం భక్తులకు అన్నప్రసాదన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రజోళ్ల రవికుమార్, దేవరకొండ రామకృష్ణ, పోస లక్ష్మీనారాయణ, మంచాల బాలరాజ్, వెంకటేష్, పోస శశిధర్, గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

**మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే:** రాఖీ పౌర్ణమి, దసరా పండగల సందర్భంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ఆర్టీసీ కార్మికులు సమష్టిగా కష్టపడి భారీ ఆదాయాన్ని సమకూర్చారని ఆర్ఎం వి.శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రీజియన్‌లోని ఎక్కువ ఆదాం వచ్చే కృషి చేసిన 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు, అయిదుగురు అద్దె బస్సు డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్, శ్రామిక్ ఒక్కొక్కరికి అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా వనపర్తికి బహుమతి అందజేశారు. ఉప ఆర్ఎంలు శ్యామల, లక్ష్మీధర్మ వివిధ డిపోల డీఎంలు, సహాయ మేనేజర్లు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



విచారిస్తున్న ఎస్ఐ

**మద్దూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని సాయిబాబా ఆలయం పక్కన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు. ఆ ఇంట్లో కృష్ణ, లత దంపతులు కిరాయికి ఉంటున్నారు. లత ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. తాళం వేసి మంగళవారం ఆమె పాఠశాలకు వెళ్లాక ఇంట్లో గుర్తు తెలియని వక్తులు చొరబడి బీరువాలో ఉన్న 6.5 తులాల బంగారాన్ని దొంగిలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా కుమురం భీం జయంతి



కుమురం భీం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

**మద్దూరు, న్యూస్‌టుడే:** తెలంగాణ పోరాట యోధుడు కుమురం భీం జయంతిని మద్దూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం అవరణలో భీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల కృష్ణ, జనార్దన్‌రెడ్డి, లాలుప్రసాద్, దాసు, రాము, బాబు, సైదాల్, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య, లక్ష్మయ్య, గోవిందు, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులూ! సమయం వృథా చేయొద్దు

**మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే :** విద్యార్థులు టీవీలు, చరవాణిలకు దూరంగా ఉండాలని ఎంఈవో అనిల్‌గౌడ్ అన్నారు. మంగళవారం కాట్రేవ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఎస్ఏ 1 పరీక్షలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకపఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సమయం వృథా చేయరాదన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వాహణలో సమయపాలన పాటిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వర్షపు నీరు వెళ్లేదెలా?



గుండుమాల్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే:** అంతర్గత రహదారుల్లో సీసీ వేశారని, మురుగు కాలువలు లేక రోడ్డుపైకే వర్షం నీరు వస్తోందని గుండుమాల్ వాసులు అంటున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడపడితే అక్కడ నీళ్లు రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. దీంతో పాదచారులు కాలినడకన వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతంలో చిన్నపాటి కాలువను తవ్వి అలాగే వదిలేశారు. కాలనీల్లో వర్షపు నీరు వెళ్లేలా మురుగుపారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.